ప్రజాశక్తి ఆదివారం నవంబర్ 9, 2008

# హద్దు

నరసయ్యకి కడుపు రగిలిపోతోంది. రంగమ్మకీ మనసు కుతకుతలాడి పోతుంది. ఇద్దరూ ఇలా జరుగుతందని కలలో కూడా ఊహించలేదు. ఇంతకీ జరిగిందేమిటి?

+ + +

ఆ ఇంటికే ముహూర్తాన వచ్చి చేరారో గానీ - నరసయ్యే పనిమనిషీ, తోటమాలీ, డ్రైవరూ -

'వెచ్చాలు తేవాలి నరసయ్యా', 'ఆ చెట్టు మాట వినని పనిమనిషిలా అటూ ఇటూ విరగబడుతోంది. ఆ కరివేపాకు కొట్టేసి మార్కెట్‌లో ఇచ్చేయాలి నరసయ్యా, 'ఆ సన్నజాజి తీగె దేశాటనం మొదలెట్టింది. లాగి కట్టుదాన్ని', 'అరటి చెట్లకి పాదులు చెయ్యాలి నరసయ్యా', 'ఇటు చూడు ఈ బియ్యం మూటలిక్కడే వుంచేశావ్. సజ్జ మీద కెక్కించెయ్', 'రేపు గుంటూరు వెళ్ళి రావాలి. తెల్లవారుజామునే బయల్దేరదాం. కారు సిద్ధం చేసుకో.'

ఇలా, ఇంట్లో ఏది కావాలన్నా నరసయ్యా అనే పిలుపే!

రంగమ్మకీ పురమాయింపులు తక్కువేమీ కావు. గుడ్డలుతకటం, అంట్లు తోమటం, ఇల్లు శుభ్రం చేయటం వంటి పనులన్నీ ఆమెవే.

భాగ్యమ్మ రాగాలు తీస్తుంది. 'రంగమ్మా చూడవే. ఆ పెసల పని అట్టాగే ఉండిపోయింది. ఎప్పుడు మర పట్టించుకొస్తావే?'. . భాగ్యమ్మ కూతురు పంకజమ్మ 'రంగమ్మా, రేపు భోగి, ఎల్లుండి ఉండ్రాళ్ళ తద్దెకదే. ఆ గోరింటాకు దూసి రుబ్బు. నీ పిల్లలకీ కావాలి'. 'పెద్ద పండగొస్తున్నదే. ఇల్లు బూజు దులిపి, తుడిచెయ్యాలి'. పంకజమ్మ కూతురు చంద్రలేఖకి చాలా పనులుంటయ్. ' ఈ ఏడాది ఇక్కడున్నాం కదా, ఢిల్లీలో ఈ ముచ్చట్లేమీ వుండవు. ఆ వేపచెట్టుకి ఉయ్యాల కట్టించు. పిల్లలు ఊగుతారు. మా చక్రంగాడూ, సుధా చూస్తారా ముచ్చట' – ఇదీ వరస!

సమయాలూ, సందర్భాలూ వేరు. అంతే!

అన్నిటికీ ఎదరికీ ఈ దంపతుల జవాబు 'అలాగేనమ్మా' అనే.

వీళ్ళిద్దరూ విజయవాడలో ఆ యింటికొచ్చి పన్నెండేళ్ళు. రెండు గదుల ఔట్‌హౌస్‌లో కాపరం. అప్పుడు వీళ్ళ పెద్దపిల్ల లక్ష్మికి ఆరేళ్ళు. కొడుకు దీపూకి మూడేళ్ళు. అద్దె లేదు. ఇద్దరూ ఇంట్లో మనుషుల్లా భాగ్యమ్మా వాళ్ళతో కలిసిపోయారు.

భాగ్యమ్మకి భర్త లేదు. ఒక్కటే కూతురు పంకజం. ఈమె భర్త నాలుగేళ్ళ క్రితం పోయాడు. ఆయన చేసిన పనల్లా దోశెడు నోట్లు తీసుకుని దేశాటన పోవటం. తిరిగి తిరిగి మళ్ళీ డబ్బు కోసం రావటం. తాగి తాగి పోయాడంటారు. ఎక్కడో పక్కటౌన్లో వేరే మనిషితో సంసారమూ ఉందనే వారు. పంకజమ్మ బిడ్డల్ని ఒక పద్ధతిగా పెంచింది. కూతురు చంద్రలేఖ ఢిల్లీలో వుంటుంది. ఇద్దరు పిల్లలు. చక్రవర్తి, సుధ. భర్త సెంట్రల్ గవర్నమెంట్‌లో పెద్ద ఉద్యోగి. పంకజమ్మ కొడుకు అవినాష్. కోడలు అనుపమ. ఇద్దరూ డాక్టర్లు. అమెరికాలో ఉంటారు. రెండేళ్ళకో, మూడేళ్ళకో గానీ రారు. వచ్చినప్పుడో నెల ఉండి వెళ్తారు. అమ్మమ్మకీ, అమ్మకీ సౌకర్యంగా వుంటుందని కారు కొని ఇంట్లో పెట్టి వెళ్ళాడు అవినాష్. ఊళ్ళో ఏ పనులున్నా, గుంటూరులో ఉన్న భాగ్యమ్మ అన్న డాక్టర్ రామలింగయ్యగారింటికి వెళ్ళాలన్నా కార్లోనే వెళ్తారు. నెలలో నిండా పదిరోజులు కూడా కారు బయటికి తీసే అవసరం రాదు.

\+ \+ \+

'మావ ఎక్కడన్నా పనుంటే డ్రైవర్‌గా వెళ్తానంటున్నాడమ్మా. పిల్లలు పెద్దవాళ్ళవు

తున్నారు. మీకు తెలీనిదేముంది. నాలుగు రూపాయలొస్తే వేణ్ణీళ్ళకి చన్నీళ్ళలా కాస్త చెయ్యాదుతుంది". నీళ్ళు నములుత్తూ అడిగింది రంగమ్మ. ఆమె భర్తని మావ అనే పిలుస్తుంది. అమ్మ తమ్ముడే మరి!

భాగ్యమ్మ తలెత్తి అదోలా చూసింది. చేతిలో భాగవతం పుస్తకాన్ని పక్కన పెట్టింది. పంకజమ్మ ఉన్నది. ఆమే గయ్‌మన్నది. "అంటే పార్ట్‌టైమ్ పని చేస్తాట్టే మీ ఆయన? కారు తియ్యకబోతే మాత్రం మనకు ఇంట్లోనూ బయటా పనుల్లేవూ?"

రంగమ్మ మారు మాట్లాడలేదు.

ఆ రాత్రి భర్తకి ఈ సంగతి చెప్పి "పోన్లే మావా, వాళ్ళ మనుషులుగా ఇంతకాలమూ కలిసిపొయ్యాం. రోజులు గడిచి పోతున్నై కదా, చూద్దాం" అన్నది.

నరసయ్య భార్య వైపూ, గోడవారగా చాప మీద పడుకుని నిద్రపోతున్న కూతురు వైపూ చూపు మార్చి మార్చి చూస్తూ ఉండిపోయారు.

తర్వాత చాలా సేపటికి తనకు తానే చెప్పుకుంటున్నట్టు పైకే అన్నాడు. "పిల్లకి సమ్మందాలు చూడాలి రంగీ" అని, క్షణాల తర్వాత "వీడికీ ఈ ఏడాదితో టెన్త్ అయిపోతుంది. పిల్లనంటే అక్కడితో ఆపేశాం. వీడినేం చేయాలో మరి" అన్నాడు.

దిగాలుగా భర్తవైపు చూసింది రంగమ్మ. "చూద్దాం పడుకో" అని గాల్లో దేవుడికి దణ్ణం పెడుతూ నడుం వాల్చింది.

+ + +

లక్ష్మికి పెళ్ళి సంబంధం దొరికింది. ఒక తెలిసినాయన ద్వారా వచ్చింది. వరుడు నరేందర్. ఎలక్ట్రీషియన్. ఏదో ఒక షాపుతో లింకు కుదిరింది. షాపు కొచ్చే వారితో మంచిగా వుంటూ పనుల్ని రాబట్టుకోగల నేర్పు వుంది. ఇటీవల ఒక అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్ కాంట్రాక్టు తీసుకుని, ఇంకో ఇద్దరు స్నేహితులతో కలిసి పని పూర్తి చేశాడు. పైసలు బాగానే వచ్చినై. నరేందర్‌కి తల్లీ, ఒక తమ్ముడు, ఒక చెల్లెలు. తమ్ముడు నైన్త్‌లోనూ, చెల్లెలు ఆరులోనూ చదువుతున్నారు. మూడుగదుల పాత ఇల్లుంది.

పెళ్ళి చూపులయినై. సరి అనుకున్నారు ఇరుపక్షాలూ.

భాగ్యమ్మగారి సముఖంలోనే కట్నకానుకల మాటలూ సాగినై. నరేందర్ తల్లి అరవైవేలు అడిగింది.

నరసయ్య, రంగమ్మ గుడ్లు తేలేశారు. తమ వల్ల కాదన్నారు. ఆలోచించుకుని

తర్వాత చెప్తామన్నారు. ఇందులో భాగమ్మ పెద్దరికంగా ఇద్దర్నీ కూచోపెట్టింది.

నరేందర్ తల్లి సాత్వికమైన స్వభావం కలిగిన మనిషే. "పెద్దవారు మీరు చెప్తే కాదనేదేం వుంది" అంది భాగ్యమ్మని చూస్తూ.

దిక్కులు చూస్తూ కూర్చున్నారు నరసయ్య, రంగమ్మా. లోవాకిట్లో లక్ష్మి. తల్లి పక్కగా నరేందర్ ఉత్కంఠతో, ఉద్వేగంతో దొంగచూపుల్లో మునిగి వున్నారు.

భాగ్యమ్మ అన్నది, "వీళ్ళ సంగతీ, స్థితిగతులూ తెలుసుకున్నారు కదా. అన్నీ కలిపి నలభై వేలిస్తారు. సరే అనుకోండి. పిల్ల బంగారం. చూశారు గదా. చిదిమి దీపం పెట్టుకోవచ్చు."

చాలా మాటల కలబోత తర్వాత, "సరే కానియ్యండి" అంది నరేందర్ తల్లి.

అక్కడికి ఆ ఘట్టం పూర్తయింది.

నరసయ్యా, రంగమ్మా పనిపాటలు చేస్తున్నారన్నమాటే గానీ, ఇద్దరికీ మనసు మనసులో లేదు. గుండెల మీది కుంపటి నెత్తిమీది కొచ్చినట్లయింది. డబ్బు సమస్య! మనుషుల్ని ఊపిరి సలపనీయటం లేదు. ఇద్దరి కళ్ళల్లోనూ ఎడారి మబ్బులు కమ్ముకునే ఉన్నై.

ఆ వేళ రంగమ్మని కూర్చోపెట్టింది.

"మనసు పాడుచేసుకుని పిచ్చివాళ్ళల్లా తిరక్కండి. పల్లెలో చిన్న కొంప ఉందన్నారు గదా. దాన్ని అమ్మేసి రమ్మను. అదేం ఉద్ధరించడం లేదు గదా. నలభై వేలు రాకపోవు. పని గడిచిపోతుంది. పిల్ల సుఖపడుతుంది. మీ ఆయనకి చెప్పు."

ఈ హితబోధ రంగమ్మకీ బాగానే వుందనిపించింది.

పల్లెకు పోయి ఆ పని కానిచ్చుకొచ్చాడు నరసయ్య. నలభైవేలు వచ్చింది. నరేందర్ తల్లికి అందజేయించాడు.

లేనివాడి ఆలోచనలెప్పుడూ నలుదిశలకీ పరుగెత్తుతూనే ఉంటాయి. కట్నం డబ్బు సమకూరింది. ఇచ్చేశారు సరే. మరి పెళ్ళి ఖర్చు? ఇదీ సమస్య. భార్యాభర్తా మల్లగుల్లాలు పడుతూనే క్షణాల్ని యుగాలుగా గడపసాగారు.

ఆ రాత్రి –

వంటింట్లో

చీకటి తెరల మధ్య రంగమ్మ గుండెలకి తల ఆనించిన నరసయ్యకి నులివెచ్చని స్పృహ కలిగింది. తక్కున లేచి కూర్చున్నాడు. "ఇవన్నీ కాదు గానీ, రేపు పెద్దమ్మగారినే

అడుగుదామే. మీరే లక్ష్మిని పెళ్ళిచేసి గడప దాటించాలని చెప్దాం" అన్నాడు.

అరమోడ్పు కనులతో భర్త తల నిమిరింది రంగమ్మ. "అవునయ్యా, అదొక్కటే మనకున్న దారి" అన్నది. కించిత్తు ఆశా, ఒకింత సందేహమూ ఆమె మాటల్లో ధ్వనించినై.

తేలికపడిన మనసులు తనువుల్నీ సేదదీరమన్నాయి.

ఊసుల్లో ఉసురుసులు సాగినై!

\+ \+ \+

సెప్టెంబర్ జరుగుతోంది. దసరా రాబోతోంది.

నవంబర్‌లో ముహూర్తం పెట్టించమని తొందరచేస్తోంది నరేందర్ తల్లి.

ఆవేళ సాయంత్రం –

అందరూ తీరుబడిగా హాల్లో కూర్చుని ఉన్నారు.

నరసయ్యా రంగమ్మా మొహామొహాలు చూసుకుంటూ, భాగ్యమ్మగారిని చూస్తూ చేతులు నలుపుకుంటూ నిలబడ్డారు.

వీళ్ళేదో తమలో తాము గుంజాటన పడుతున్నట్లు భాగ్యమ్మ కూడా అర్థం చేసుకుంది. "చెప్పండి" అన్నది.

పంకజమ్మా రంగమ్మ మొహం కేసి చూసింది.

రంగమ్మ పెదవి విప్పింది. "లక్ష్మినెలాగైనా మీరే...." అంటూ నీళ్ళు నమిలింది.

"అంటే....?" పంకజమ్మ గద్దించింది.

"పెళ్ళి ఖర్చు......" రంగమ్మ మాటలు పూర్తి చేయలేకపోయింది. నేలచూపు నిగిడ్చింది. నరసయ్య కూడా అదే స్థితిలో వున్నాడు.

భాగ్యమ్మ ముఖ కవళికలు మారినై.

తల్లి ఏం చెబుతుందా అని ఉత్సకతతో చూస్తోంది పకంజమ్మ. నరసయ్యా, రంగమ్మా ఊపిరి బిగపట్టి నిలబడ్డారు.

క్షణం సేపు గంభీరంగా ఉండి, దిటవైన కంఠస్వరంతో అన్నది భాగ్యమ్మ. "అంటే, మీ బాధ్యతా, బరువూ మా మీద పెడుతున్నారా? ఏమనుకుంటున్నారే మీరు? ఏమిటీ చొరవా, తెగింపూ? మంచీ మర్యాదా ఉండఖ్ఖర్లే?"

"మేమేమిస్తే దాన్ని తీసుకోవటం వరకే మర్యాద. అంతేగానీ, బరితెగించి

మీరే ఇట్లా అడగటం కుదరదు" పంకజమ్మ కూడా అంతే గట్టిగా అన్నది.

"నా మనసుకు నచ్చింది నేను చేస్తా. అంతే. గుర్తుంచుకోండి."

"అసలు మీరడగకూడదు. ఇచ్చింది తీసుకోవాలి అంతే."

"ఎక్కడుండాల్సిన వాళ్ళు అక్కడుండాలి. అది మర్చిపోకూడదు."

నరసయ్యా, రంగమ్మా దిగ్భ్రాంతికి లోనయ్యారు. అమ్మా కూతురు మాటలు శూలాల్లా తగిలినై.

అదిగో – సరిగ్గా అప్పుడూ.

నరసయ్యకి కడుపు రగిలిపోయింది. రంగమ్మకీ మనసు కుతకుతలాడి పోయింది. ఇద్దరూ ఇలా జరుగుతుందని ఊహించలేదు. తల్లీకూతురూ ఇలా మాటల ఈటెలు వదుల్తారనుకోలేదు.

–పన్నెండేళ్ళ చాకిరీకి ఇదా ఫలితం? ఎంత తేలిగ్గా తీసిపారేశారు ఇద్దరూనూ? రెక్కల కష్టానికి ఇదా వీళ్ళిచ్చే విలువ? ఇద్దరి కళ్ళల్లోనూ నీరు తిరిగింది.

ఆ కన్నీటి తెర మధ్యగా తమ ఉనికి ఏమిటో వారికి తెలిసొచ్చింది. పక్కకొచ్చేశారు. ముందుకు చూస్తే– నరసయ్యకి ట్రావెల్ ఏజెన్సీ కళ్ళ ముందు కనిపించింది.

రంగమ్మకి కాలనీలో వేరే ఇళ్ళూ, మనుషులూ కనిపిస్తున్నారు.

ఇద్దరి మనసుల్లోనూ కూతురి పెళ్ళికి చిట్టీల తాయారమ్మ మెదిలింది!

ఊరు విశాలంగా అనిపించింది.

గాలి చల్లగా ఆహ్వానిస్తోంది!!